క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి అంబటి దంపతులు



రాజుపాలెం: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరంపాడు కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రి అంబటి రాంబాబు, ఇతర నాయకులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయగా స్వామి ప్రసాదాన్ని అందుకున్నారు. ఆయతో పాటు సత్తెనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ తులసి, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు డాక్టర్ గీతాహాసంతి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

కారెంపూడి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కారెంపూడిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు.

ఇంటి పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం

అచ్చంపేట: మండలంలోని తాడువాయిలో గాలులతో కూడిన భారీ వర్షానికి మల్లాడి తాతారావు ఇంటి పునర్నిర్మాణానికి లీగల్‌సెల్ అవేర్నెస్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు డాక్టర్ పుట్టి అంథోనిరాజు గురువారం రూ.8వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మరికొంత మంది దాతలు ఆదుకున్నట్లయితే బాధిత తాతారావు ఇంటి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు.

మాదిపాడులో వేగంగా అంతర్గత రోడ్ల నిర్మాణం



అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. వైఎస్సార్ విగ్రహ సెంటర్ నుంచి కృష్ణానదికి వెళ్లే పడవ రహదారి, హిందూ శ్మశాన వాటికి రహదారి ఈ రెండు రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వర్షం పడితే గ్రామస్తులు నడిచేందుకు కూడా వీలులేక తీవ్ర ఇబ్బందులకు లోనైన పరిస్థితులు నెలకొన్నాయి. సమస్యను ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లిన తక్షణమే సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయాయ చేసి పంపాలని అధికారులను కోరారు. వాటి ఆధారంగా రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేయించడమే కాకుండా వారం రోజులలోనే రూ.20 లక్షలతో నిర్మాణం కూడా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. గ్రామస్తులు గత ప్రభుత్వ హయాంలో ఎన్నో సార్లు పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని, ఎమ్మెల్యే రోడ్ల దుస్థితిన స్వయంగా చూసి నిర్మాణానికి చర్యలు చేపట్లారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తికావడంలో సర్పంచి మాదా ఈశ్వరమ్మ,వెంకట్రావు, ఎంపీటీసీ స్వర్ణమ్మ, రమేష్‌నాయక్, సత్తెమ్మతల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ గుడారి గోపి ప్రత్యేక చొరవ చూపినందుకు గ్రామస్తులు అభినందించారు.

ప్రశాంతతకు యోగా దోహదం



సత్తెనపల్లి: మానసిక, ఆరోగ్య ప్రశాంతతకు యోగ ఎంతో దోహదపడుతుంది అని సత్యాధ్యానమందిర వ్యవస్థాపక అధ్యక్షుడు గణపవరపు రంగారావు అన్నారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నాగార్జున నగర్‌లోని సత్యాధ్యానమందిరం ఆవరణలో గురువారం నిర్వహించిన యోగ ప్రోత్సాహక సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు యోగా గురుజి రోజా రాణి సుభాష్ చంద్ర వ్యవహరించారు. రంగారావు మాట్లాడుతూ మనసును శరీరాన్ని ఏకం చేసేది యోగానేనన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగ మీద అధికంగా చొరవ చూపాలని కోరారు. ప్రతి మనిషికి యోగా అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగా ఆసక్తితో చేరిన 25 మంది యోగ అభ్యాసకులకు గణపరపు రంగారావు, పార్వతి దేవి సంయుక్తంగా ప్రోత్సాహక సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుత పరిస్థితులలో మహిళలకు యోగ ఎంతో అవసరమన్నారు యోగ అభ్యాసకులు అందరూ కలిసి సత్యాధ్యానమందిరం నిర్వహణ ఖర్చుల నిమిత్తం యోగా గురూజీ రోజా రాణి రూ.10 వేలు విరాళాన్ని కొమార వెంకట రమణ నాగరాజుకు అందజేశారు. సభలో సత్యాధ్యానమందిరం మాజీ అధ్యక్షులు ఉన్నవ పూర్ణచంద్ర ప్రసాదరావు, పీసపాటి హనుమంతరావు, ఉపాధ్యాయురాలు శాస్త్రి పాల్గొన్నారు.

పన్ను వసూలు అంతంతమాత్రమే..

నేటి వరకే గడువు !

- మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లింపునకు ఆఖరు
- జూలై ఒకటి నుంచి చెల్లించే వారిపై 2 శాతం వడ్డీ భారం
- సత్తెనపల్లి మున్సిపాల్టీ పరిధిలో 15 వేలకు పైగా అసెస్మెంట్లు
- మొత్తం డిమాండ్ ఇప్పటి వరకు వసూలైంది రూ.1.60 కోట్లు మాత్రమే



సత్తెనపల్లి పట్టణంలోని భవనాలు

సత్తెనపల్లి: పురపాలక సంఘానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా ... ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నా ... వివిధ రూపాల్లో ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల కింద నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానా నింపుకోవాల్సిందే. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలుపై దృష్టి సారించిన మున్సిపల్ శాఖ మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తాన్ని రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు విడతల్లో భవన యజమానులు పన్ను చెల్లించాల్సి ఉండగా... మొదటి అర్ధ సంవత్సరం గడువు ఈనెల 30తో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కాలేదు.

15,527 అసెస్మెంట్లు ..

పురపాలక సంఘ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 15,527 అసెస్మెంట్లు ఉన్నాయి. వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.4.59 కోట్లు వసూలు కావాల్సి ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో మరో రూ.1.04 కోట్లు బకాయిలున్నాయి. మొత్తంగా రూ.5.63 కోట్లు ఖజానాకు జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.1.60 కోట్లు(28.42 శాతం) మాత్రమే వసూలైనట్లు అధికారిక లెక్కలు వెల్లడి స్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో మొత్తం పన్ను ఒకే సారి చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. ఇంకా రూ.4.03 కోట్లు ఆస్తి పన్ను రూపంలో రావాల్సి ఉంది.

ముగియనున్న గడువు ...

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించేందుకు గడువు దగ్గరపడుతోంది. జూన్ 30లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పన్ను చెల్లించవచ్చని పురపాలక యంత్రాంగం ప్రకటించింది. జూలై ఒకటో తేదీ నుంచి పన్ను చెల్లించేవారు 2 శాతం వడ్డీతో పన్ను మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దగ్గర పడుతుండడంతో మున్సిపల్ యంత్రాంగం పట్టణంలోని భవన యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించటం ద్వారా వడ్డీ భారం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్ను చెల్లించేందుకు జూన్ 30 వరకు ఎటువంటి అపరాధ రుసుం ఉండదు. అనంతరం పన్ను చెల్లించే వారిపై మొదటి అర్ధ సంవత్సరం డిమాండ్‌పై 2 శాతం వడ్డీ పడుతుంది. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలి. వడ్డీ భారం నుంచి విముక్తి పొందవచ్చు.

–కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ



లగడపాడులో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

పెదకూరపాడు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లగడపాడు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ అర్జీలు అందజేశారు. కలెక్టర్ గురువారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1996–97లో భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 28– 2ఎ, 28–2బీ 1లో 80 ఎకరాలు భూమి ఇచ్చారు. మా అప్పు మొత్తం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తీర్చారు. కానీ 22ఎ లిస్ట్ ఉన్నాయని, వాటిని తొలగించాలని విన్నవించారు. గ్రామంలోని శ్మశానానికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వికలాంగుడైనా సాంకేతిక పరమైన సమస్యలతో పింఛన్ అందడం లేదని, గురుకుల పాఠశాలలో మా పిల్లలకు సీట్లు ఇప్పించాలని, పొలంలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పట్టాదారుపాస్ పుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదు అయ్యాయని, బీమా పథకం రాలేదని, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నానని ఇలా గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అర్జీలు అందించారు. అంతకు ముందు కలెక్టర్ మీడియాతో మాట్లాడారు.

అమ్మ ఒడిని సక్రమంగా వినియోగించుకోండి..

ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా చదువుకునే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో అమ్మఒడి కింద రూ.13 వేలు జమ చేస్తోందని చెప్పారు. అమ్మ ఒడి పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అమ్మ ఒడి పొందిన లబ్ధిదారులు ముందుకు వస్తే వారు ఇచ్చే కొంత మేర నగదుతో విద్యార్థులను విజ్ఞానం పెంపొందించే విధంగా విహార యాత్రలకు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రక్తహీనతపై యుద్ధం చేద్దాం...

పల్నాడు జిల్లాలో 11 సంవత్సరాలు నుంచి 18 సవత్సరాలు లోపు బాలికలలో 82 శాతం రక్త హీనత ఉందని దీనిని నివారించేందుకు తల్లిదండ్రులు బాలికలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ అన్నారు. లగడపాడు గ్రామంలోనే 179 మంది బాలికలు ఉంటే వారిలో 120 మంది రక్తహీనత కలిగిన బాలికలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ అంటే మీ ఇంటి డాక్టరే...

ప్రభుత్వం ప్రతి ఇంటికి వచ్చి వైద్యసేవలు అందిస్తుందని ఫ్యామిలీ డాక్టర్ అంటే మీ ఇంటి డాక్టరే అని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ప్రతి నెల రెండు సార్లు ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం నిర్వహిస్తారని కార్యక్రమం వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్‌కు గ్రామంలోని ప్రతి ఒక్కరూ తెలిసి ఉండేలా సేవలు అందించాలన్నారు.

అమరావతి- బెల్లంకొండ రోడ్డు వేగంగా పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమరావతి– బెల్లంకొండ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని ధరణికోట ఆర్‌వీవీఎస్ కాలేజి వద్ద రెండు లైన్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రోడ్డు నిర్మాణంతో నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని చెప్పారు. అభివృద్ధి చూసి ఓర్వలేని కొన్ని దుష్టశక్తులు కోర్టులకు కూడా వెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నా రాజకీయ జీవితంలో ఈ రోడ్డు నిర్మాణం మైలు రాయిగా మిగులుతుందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. సుమారు 47 కిలోమీటర్ల మేర రూ.149 కోట్లతో 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నామన్నారు. దీన్ని 9 నెలల్లో పూర్తి చేసి తీరతామని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి కూడా త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న తనపై విమర్శలు చేసే వాళ్లకు రాజకీయ భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ మేకల హనుమంతరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కరుణకుమారి, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ షేక్ హఫీ, క్రోసూరు ఎంపీపీ కోటయ్య, బెల్లంకొండ వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



వేంకటేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే శంకరరావు దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు



చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో పారాయణం చేస్తున్న భక్తులు

అమరావతి: తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అమరావతి, వైకుంఠపురం దేవాలయాలకు వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వైకుంఠపురం వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు తరలివచ్చారు. కృష్ణానది ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి కొండపైన స్వయంభూగా వెలసిన వెంకటేశ్వరుని దర్శించిన అనంతరం కొండ కింద వేంచేసి ఉన్న వెంకటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో తొలిఏకాదశి వేడుకలలో భాగంగా అర్చకులు ఉదయాన్నే స్వామికి పంచామృత స్నపనానంతరం విశేష అలంకారం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మున్నంగి వారి కోలాటం ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పంచారామ క్షేత్రాలలో ప్రథమారామక్షేత్రమైన అమరావతిలోని తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో భక్తులు అమరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు అమరేశ్వరునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే నంబూరు

వైకుంఠపురం వేంకటేశ్వరుని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామివారికి అష్టోత్తరపూజలు నిర్వహించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకరరావు దంపతులు ప్రారంభించారు. ఆయన వెంట క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ మేకల హనుమంతరావు ఉన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: తొలి ఏకాదశిని మండలంలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని చేజర్లలోని అతిపురాతన దేవాలయమైన శ్రీగంగా భ్రమరాంబ సమేత కపోతేశ్వరస్వామి ఆలయంలో శిబిసేవ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో తొలిఏకాదశి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయాల్లోని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: మండలంలోని అన్నీ గ్రామాలలో గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం, చంద్రాజపాలెం, పాపాయపాలెం, వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం తదితర గ్రామాలలో భక్తులు వేకువజామునే పుణ్య స్నానాలను ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు బాగా ఉండాలని దేవతలను వేడుకున్నారు. వెంకటాయపాలెం గ్రామంలోని కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని కొండపై ఉన్న గంగా పార్వతీ సమేత నాగేశ్వర, గౌతమేశ్వర స్వామి వివిధ గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలను చేశారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు తెల్లవారు జామునేపుణ్యస్నానాలు ఆచరించి మండలకేంద్రంలో మందిరంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణం, మండలంలోని వివిధ దేవాల యాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, గోత్ర నామ పూజలు నిర్వహించారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్టా మహోత్సవం అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, భక్తులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): గ్రామంలోని ఎస్టీ కాలనీలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక సహాయంతో 822 దేవాలయాలు నిర్మాణం చేయడం అందులో 657 దేవాలయాలు ప్రతిష్ట చేసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన దేవాలయాలు ప్రతిష్టకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రతి దేవాలయానికి ఆ సామాజిక వర్గానికి సంబంధిచిన వ్యక్తిని తిరుమల, తిరుపతి దేవస్థానం శ్వేతాలు శిక్షణ ఇవ్వడం, వారే ప్రతి రోజు దేవాలయంలో పూజలు చేయడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో దేవాలయం కేంద్రంగా బాలవికాసను ప్రారంభించడం, కాలనీలోని ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులందరికీ గుడి కేంద్రంగా 6 నుంచి చదువు, సంస్కారాలు నేర్పడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ దేవాలయ ఇన్‌చార్జి ఎ.ఎస్. కె.వి.రంగారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



నకరికల్లులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



పెదకూరపాడులో...



మాదిపాడు ఈద్గా వద్ద..

నకరికల్లు: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ నియోజకవర్గంలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, చేజర్ల, కుంకలగుంట, చాగల్లు, దేచవరం, చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాల్లో ఈద్గాలను, మసీదులను ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే ముస్లింలు మసీదులకు వెళ్లారు. మతపెద్దల ఆధ్వర్యంలో రెండు రకాతుల ఈదుల్‌జుహా నమాజును సామూహికంగా పఠించారు. ఈద్గాల వద్ద ఏర్పాట్లను ఈద్గా కమిటీలు పర్యవేక్షించాయి.

క్రోసూరులో..

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో గురువారం బక్రీద్ పండుగ జరుపుకున్నారు. బయ్యవరం, ఊటుకూరు, అనంతవరం, దొడ్లేరు, ఆవులవారిపాలెం, హసనాబాద్, నాగవరం, 88త్యాళ్లూరు, పీసపాడు గ్రామాల్లో ముస్లింలు ఉదయం 8 గంటలకే మసీదులకు చేరుకుని ప్రత్యేక నమాజు నిర్వహించారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు: త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని పలువురు పేర్కొన్నారు. పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. మండలంలోని పెదకూరపాడు, పాటిబండ్ల, లగడపాడు, పాడపాడు, తమ్మవరం, కన్నెగండ్ల, చిన్నమక్కెన గ్రామాల్లో ఈద్గాల వద్దకు ప్రదర్శనగా చేరి సామూహిక ప్రార్థనలు చేశారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్ల, మాదల, తొండపి, నార్నెపాడు, ఇరుకుపాలెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద నిర్వహించిన సమూహిక నమాజ్ మత పెద్దలు పాల్గొని ప్రవక్త బోధనలను వివరించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పవిత్ర బక్రీద్ పండుగను మండలంలోని పలు గ్రామాలలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అచ్చంపేట, మాదిపాడు, కస్తల గ్రామాలలో ప్రత్యేక నమాజ్ చేశారు. అక్కడ మత పెద్దలు పవిత్ర ఖురాన్ పఠనం చేశారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో బక్రీద్ పర్వదినాన్ని జరుపుకున్నారు. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, నందిరాజుపాలెం, మాచాయపాలెం పునరావాస కేంద్రాలలో వేకువ జామునే నమాజ్ కార్యక్రమాలు చేసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో బ్యాంక్ సమీపంలోని మసీదు వద్దకు అధిక సంఖ్యలో చేరి ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం, మొక్కపాడు, అనుపాలెం, ఇనిమెట్ల, గణపవరం,కొండమోడు తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడు

చిలకలూరిపేట: కృషి, పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ చెప్పారు. సంఘ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు విద్యను నేర్పేందుకు నిరాకరించినా పట్టుదల, స్వయం కృషితో విలువిద్య నేర్చుకున్న వీరుడని కొనియాడారు. విద్య నేర్పనప్పటికీ ద్రోణాచార్యుడు అడిగిందే తడవుగా బొటన వేలును త్యాగం చేసిన మహావీరుడని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు బి చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, రాంబాబునాయక్ పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



సైకిళ్ల అందుకున్న బాలికలతో ఎస్‌ఐ రఘుపతిరావు, రోటరీ బాధ్యులు

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ సత్తెనపల్లి సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శనీయంగా ఉంటుందని పట్టణ ఎస్ఐ ఏ రఘుపతిరావు అన్నారు. వివిధ పాఠశాలలో చదువుతున్న 21 మంది పేద విద్యార్థులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందించిన సహకారంతో విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ మాట్లాడుతూ బాలికలు పాఠశాలకు వెళ్లడానికి సైకిళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పాయసం మహేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్ బాపతు శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు, ధారా జాషువా, షేక్ సిరాజ్, ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు తుమ్మల వెంకటేష్, సాయి రమేష్, షేక్ సుభాని, కమలాకర్ రావు, లక్ష్మణ్ సుబ్బారావు, వనమా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు రేషన్, ఆర్థికసాయం

నకరికల్లు: స్వగ్రామంలోని పేదలకు చేయూతనిచ్చేందుకు గుండ్లపల్లి ఎంప్లాయీస్ యూనియన్ స్థాపించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు ఇటీవల రోడ్డుప్రమాదానికి గురై అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడుతుండగా వారికి రేషన్, ఆర్థిక సాయం గురువారం అందించారు.

సవరణ

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పిడుగురాళ్ళ బ్రాంచి కామినేడి రామయ్య గారి ఆస్తికి సంబంధించిన D.No:29841/2022 ప్రకటనలో పిడుగురాళ్ళ బ్రాంచికు బదులు సత్తెనపల్లి బ్రాంచిగా చదువుకోగలరు.
లంకా విజయ్‌కుమార్, లంకావంశీకృష్ణ
న్యాయవాదులు, శివ టైమ్స్, వసంతనగర్, గుంటూరు.
సెల్: 9030595227, 9848052914

విత్తనాల షాపులపై విజిలెన్స్ దాడులు



క్రోసూరు: క్రోసూరు లోని విత్తనాల షాపులను విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేసినట్లు ఏఓ వేణుగోపాల్ గురువారం తెలిపారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో అచ్చంపేట, క్రోసూరు విత్తనాల షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. అచ్చంపేటలోని శ్రీమణికంఠ సీడ్స్, క్రోసూరులోని శివసాయి సీడ్స్, లక్ష్మీనరసింహ ఎంటర్‌ప్రైజెస్ షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు ఏఓ చెప్పారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పత్తి విత్తనాలు 242.725 కిలోలు రూ.4,35,883 విలువ చేసేవి సీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు 267.900 కిలోల పత్తి విత్తనాలు అమ్మకాలు నిలిపివేసినట్లు వివరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి వాసంతి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.